

అభిమాన క్రికెటర్లను చూసేందుకు కిక్కిరిసిన జనం



విధానసౌధ వద్ద అశేష జనం

ఆయువు తీసిన అభిమానం



విరాట్ కోహ్లీ, ఆర్సీబీ కెప్టెన్‌ను సత్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య



గాయపడిన బాలుడిని మోసుకెళుతున్న పోలీసులు



ట్రోఫీతో సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆర్సీబీ క్రీడాకారులు

- చిన్నస్వామి స్టేడియం వద్ద ఘోరం
- తొక్కిసలాటలో ఊపిరాడక 11 మంది దుర్మరణం
- అంచనా వేయడంలో పోలీసుశాఖ విఫలం
- మృతులకు రూ.10 లక్షల పరిహారం.. న్యాయవిచారణ : సీఎం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): క్రికెట్ అభిమానం ఆయువుతీసింది. కొన్ని గంటలముందు 18ఏళ్లనాటి కల నెరవేరిందని అభిమానులు ఊగిసలాడారు. ఆ ఉత్సాహం ఇంకా తీరలేదు. అంతలోనే తాము మెచ్చిన ఆర్‌సీబీకి గెలిపించిన క్రికెటర్లు బెంగళూరుకు వస్తున్నారనే సమాచారంతో నగరవాసులే కాకుండా సమీప ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. ఇటు స్టేడియం, అటు విధానసౌధ వద్ద కనీసస్థాయిలో కూడా ఎంతమంది జనం వస్తారనే విషయంలో పోలీసులు అంచనా వేయలేకపోయారు. ప్రభుత్వం తరపున ఆర్‌సీబీ విజేత జట్టుకు విధానసౌధ తూర్పుద్వారం వద్ద సత్కరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇక అభిమానులు నిరంతరంగా మ్యాచ్ చూసే చిన్నస్వామి స్టేడియంకు వెళ్లి మనసారా క్రికెటర్లను చూడవచ్చని భావించారు. అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్ గెలుపు సాధించే సమయానికి దాదాపు అర్ధరాత్రి అయ్యింది. బుధవారం ఉదయం ఒక్కసారిగా కార్యక్రమాల షెడ్యూల్ ప్రకటించారు. విధానసౌధ వద్ద ప్రభుత్వ సత్కారం పొందిన క్రికెటర్లు ఓపెన్‌టాప్ బస్సుపై చిన్నస్వామి స్టేడియం దాకా ఊరేగింపుగా వెళ్లి అక్కడ అభిమానులతో సంబరాలు చేసుకునేలా కార్యక్రమం రూపొందించారు. అయితే పోలీసులు మొదట్లోనే ఊరేగింపు జరిగితే భారీగా జనం వస్తారని, ఇబ్బంది కావచ్చునని దాటవేశారు. దీంతో విధానసౌధ వద్ద ప్రభుత్వ సత్కారం, స్టేడియంలో సంబరం జరిగేలా రూపొందించారు. మధ్యాహ్నం 2 గంటలయ్యేసరికి చిన్నస్వామి స్టేడియం పరిధిలో జనం వెళ్లేందుకు తరలివచ్చారు. అయితే విధానసౌధ వద్ద 4 గంటలకు జరగాల్సిన కార్యక్రమం అరగంటకుపై జాప్యం జరిగింది. ఊరేగింపు లేదనడంతో ఇటు విధానసౌధ, అటు స్టేడియం వద్దకు అభిమానులు పోటెత్తారు. విధానసౌధ ప్రాంగణంవద్దే 60వేలమందికిపైగా అభిమానులు చేరారు. విధానసౌధ లోపలికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అభిమానులు రోడ్డుపైనే ఉండిపోయారు. అక్కడ 2-3సార్లు పోలీసులు లాఠీచార్జ్ చేసి అదుపు చేయాల్సి వచ్చింది. విధానసౌధ వద్ద కార్యక్రమం ప్రారంభం కాగానే స్టేడియం లోపలికి వెళ్లాలని గేట్ల వద్ద భారీగా జనం చేరారు. స్టేడియం సామర్థ్యం 35వేలు కాగా అంతకు ఆరేడింతలు అభిమానులు చేరారు. ఒక్కసారిగా 3, 18, 19, 20తోపాటు పలు గేట్‌లు తెరిచారు. సీట్లు దొరకవనే ఆత్రుతలో ఒకరిపై ఒకరు తోసుకుంటూ లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో 3, 2 నంబరు గేట్ల వద్ద తొక్కిసలాట జరిగింది. 11 మంది ఊపిరాడకనే మృత్యువాత పడ్డారు.

- చిన్నస్వామి స్టేడియంలో జరిగే సంబరాలకు ఎవరు రావాలనే విషయం స్పష్టత లేకుండా పోవడమే ప్రమాదానికి కారణం అనిపిస్తోంది. తొలుత పాస్‌లు ఉండేవారికి మాత్రమే ఎంట్రీ ఉంటుందన్నారు. దీని ప్రకారమైతే కేవలం మీడియాతోపాటు కేఎస్‌సీఏ సభ్యులకు మాత్రమే పాస్‌లు ఉంటాయి. అయితే 2, 3 గేట్‌లలో ఆధార్‌కార్డులు చూపి టిక్కెట్ కొనుగోలు చేయవచ్చునని ప్రచారం సాగింది. ఈలోగా గేట్ వద్ద వేలాదిమంది ఉంటే టిక్కెట్‌లు చూసేవారు ఎవరని, త్వరగా లోపలకు చేరుకోవచ్చునని ఆత్రుతచూపారు. అంతలోనే గేట్ తెరవడంతో తొక్కిసలాట అయ్యింది.

విధానసౌధ వద్ద సత్కారం

ఆర్‌సీబీ జట్టు క్రికెటర్లకు విధానసౌధ తూర్పుద్వారం వద్ద ఘనంగా సత్కరించారు. క్రికెటర్లతోపాటు టీమ్ మేనేజర్ పలువురు పాల్గొన్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లట్, సీఎం, డీసీఎంతోపాటు మంత్రులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకే ప్రత్యేక విమానంలో క్రికెటర్లు హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ డీసీఎం డీకే శివకుమార్ సాదరంగా స్వాగతించారు. అక్కడనుంచి ప్రత్యేక బస్సులో రేస్‌కోర్సురోడ్డులోని స్టార్ హోటల్‌కు చేరారు. కాసేపటి తర్వాత బయల్దేరాల్సి ఉన్నా వర్షం సూచనలు కనిపించడంతోపాటు ప్రతిచోటా జనం రోడ్లపైకి చేరడంతో సుమారు గంట ఆలస్యమైంది. విధానసౌధ వద్ద క్రికెటర్ల చూసేందుకు దాదాపు 60వేలమందికిపైగా చేరారు. విధానసౌధ లోపల అధికారులు, ఉద్యోగులతోపాటు పెద్దసంఖ్యలో జనం చేరి సన్మానం కూడా గందరగోళం అనిపించేలా సాగింది.

స్టేడియంలో ట్రోఫీతో సంబరం

తొక్కిసలాట జరిగి 11మంది మృత్యువాత జరిగినా... వేలాదిమంది స్టేడియంలో ఉండడంతో సంబరం సాగింది. స్టేడియంలోకి క్రికెటర్లు చేరుకోగానే అభిమానులు విరాట్ విరాట్ అంటూ నినాదాలు చేశారు. ఆర్‌సీబీ ఆర్‌సీబీ అంటూ కేరింతలు కొట్టారు. అయితే గంటసేపు జరగాల్సిన కార్యక్రమం కొన్ని నిమిషాల వ్యవధిలోనే ముగించారు.

ప్రధాని ప్రగాఢ సంతాపం

చిన్నస్వామిస్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11మంది మృతి చెందడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢసంతాపం తెలిపారు. క్షతగాత్రులు కోలుకోవాలని ఎక్స్ ద్వారా ఆకాంక్షించారు.

న్యాయ విచారణకు ఆదేశం: సీఎం

చిన్నస్వామి స్టేడియం వద్ద నిర్వహించింది ప్రభుత్వ కార్యక్రమం కాదని అయితే అభిమానులు పెద్దసంఖ్యలో రావడంతో అదుపు తప్పిందని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. అయితే నగరంలోని వేలాదిమంది పోలీసులను భద్రతకు కేటాయించామన్నారు. కానీ స్టేడియం కెపాసిటీ 35వేలు కాగా అంతకు ఆరేడింతలమంది రావడంతో నియంత్రణ తప్పిందన్నారు. మృతుల కుటుంబాలకు 10లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు ప్రభుత్వం ద్వారానే ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. తప్పు ఎలా జరిగిందో... ఎవరి ద్వారా జరిగిందనేది తేల్చేందుకు న్యాయవిచారణ జరుపుతామన్నారు. అనంతరం సీఎం సిద్దరామయ్య వైదేహి ఆసుపత్రిలోని బాధితులను, డీసీఎం డీకే శివకుమార్ బౌరింగ్ ఆసుపత్రిలోని క్షతగాత్రులను పరామర్శించారు.

మృతులు వీరే..

భూమిక్ (20), సహన (19), తొమ్మితో తరగతి విద్యార్థిని దివ్యాంశి (13), దియా (26), చిన్మయి (19), శ్రవణ్ (21), మండ్య జిల్లా కేఆర్ పేటకు చెందిన సివిల్ ఇంజనీర్ పూర్ణచంద్ర (26), 17 ఏళ్ల యువకుడు, 35ఏళ్ల వ్యక్తి, గుర్తు తెలియని బాలికతోపాటు మరో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహాదుర్ఘటనకు ప్రభుత్వమే కారణం

చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాల వేళ జరిగిన మహాదుర్ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని కేంద్రమంత్రి కుమారస్వామి విచారం వ్యక్తం చేశారు. అమాయకులు బలయ్యారన్నారు. తీవ్రమైన బాధ కలుగుతోందన్నారు. సమగ్రమైన ఏర్పాట్లు లేకుండానే కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్లడమే సంఘటనకు కారణమన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వమే సంఘటనకు నైతిక బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా అభిప్రాయాన్ని తెలిపారు.

మెట్రో సేవల స్తంభన

స్టేడియం వద్ద తొక్కిసలాట జరగడంతో నమ్మ మెట్రో నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. వైట్‌ఫీల్డ్-కెంగేరిలమధ్య సంచరించే మెట్రో రైలు సేవలను కాసేపు స్తంభింపచేశారు. ఆ తర్వాత యథావిధిగా సేవలు ప్రారంభించినా చిన్నస్వామి స్టేడియంకు అనుబంధంగా ఉండే కబ్బన్ పార్క్ స్టేషన్, విధానసౌధకు అనుబంధంగా ఉండే అంబేడ్కర్ వీధి స్టేషన్‌లలో మెట్రో రైళ్ల నిలపకుండా నడిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే మరణాలు: ప్రతిపక్ష నేతలు

ప్రభుత్వ వైఫల్యంతోనే 11మంది క్రికెట్ అభిమానుల మృత్యువాతకు కారణమైందని ప్రతిపక్ష నేతలు అశోక్, చలవాది నారాయణస్వామి మండిపడ్డారు. క్రికెట్ అంటే క్రేజ్ ఎక్కువని అభిమానులు ఎంతమంది వస్తారో కనీస అంచనా వేయలేకపోయారన్నారు. వేలాదిమంది స్టేడియం గేట్ల వద్ద ఉన్నప్పుడు ఆలోచన లేకుండా తీసేయడంతోనే తోపులాటకు కారణమైందన్నారు. 11 కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయని, 40మంది దాకా గాయపడ్డారని, ఇది పూర్తిగా ప్రభుత్వ విఫలమన్నారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర స్థానిక బౌరింగ్ ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు.



చిన్నస్వామి స్టేడియం వద్ద గేట్లు తెరవడంతో పరుగులు



తొక్కిసలాట



స్టేడియం నుంచి బయటకు పరుగులు తీస్తున్న జనం

ఉపాధ్యాయుల వినూత్న ఆలోచన

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ఎడ్లబండిలో ప్రచారం



ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

బళ్లారి, జూన్ 4(ఆంధజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పాలని ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎద్దులబండికి అలకంరణ చేసి నాయకులు, ఉపాధ్యాయులు కూడా రైతుల్లా నెత్తికి రుమాలు చుట్టి ఆకర్షణీయంగా, అందరినీ ఆకట్టుకునేలా ప్రచారం చేపడుతున్నారు. విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి పట్టణంలో రామనగర ఏరియాలో ఈప్రచారం సాగించారు. హగరిబొమ్మనహళ్ మున్సిపల్ చైర్మన్ మరిరామప్ప, ఉపాధ్యాయులు బృందం కలిసి ప్రచారం చేశారు. సర్కారు బడిలో నాణ్యమైన విద్యను అందించేందుకు క్వా లిఫైడ్ టీచర్లు ఉన్నారని ప్రచారం చేస్తున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో లాగా ప్రభుత్వ స్కూళ్లలో ఫీజులు ఉండవని ప్రచారం చేశారు. ఉదయం, సాయం త్రం వేళల్లో ఎడ్లబండ్ల ద్వారా రెండు పూటలా ప్రచారం చేస్తున్నారు.

నందిపుర చిరంతప్పజ్జ స్మరణోత్సవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న కళాబృందాలు

బళ్లారి సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గద్దిగేరి క్షేత్రంలోని నందిపుర మఠానికి చెందిన గురు చరంతప్పజ్జ 21వ వర్ధంతి సందర్భంగా నగరంలోని భక్తుల సమక్షంలో ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. నందిపుర మఠానికి చెందిన డాక్టర్ మహేశ్వర స్వామితో సహా వివిధ మఠాధిపతులు భక్తులతో కలిసి నృత్యం చేస్తూ ఊరేగింపుకు మరింత ఉత్సాహాన్నిచ్చారు. నగరంలోని బసవ భవన్‌లో బుధవారం జరిగిన వేదిక కార్యక్రమానికి ముందు ఊరేగింపు కనక దుర్గమ్మ దేవస్థానం నుంచి చరంతప్పజ్జ, గురు రేణుకాచార్య, బసవేశ్వర చిత్రపటాలు, కుంభకలశాలు, జానపద వాయిద్యాలతో పార్వతినగర్‌లోని బసవభవన్‌కు చేరింది. కొంతమంది భక్తులు రక్తదానం చేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు చుయించుకున్నారు. వివిధ మఠాదీపతులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో సమాజం కొరకు కష్టపడి పనిచేసిన, వివిధ రంగాలలో విజయం సాధించిన వారికి గురు చరంతప్పజ్జ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్.తిప్పన్న, మాజీ శాసనమండలి సభ్యులు అల్లం వీరభద్రప్ప, బాణాపూర్ శివరామ రెడ్డి, పంపయ్యశాస్త్రి, వేద ఆగమ శాస్త్రం, జ్యోతిష్య పండితులు చన్నబసయ్య, కరిడీశ కల్యాణ ట్రస్ట్ చొక్కా బసవనగౌడ, సమాజిక సేవకుడు గంగన్న, ఆర్వీ బసవనగౌడ, కుప్పగల్ అయ్యప్ప, చోరనూర్ కొట్రప్పలను సన్మానించారు.

లోకాయుక్తకు చిక్కిన హోంగార్డ్ కమాండర్



హోంగార్డ్ కమాండర్ జంబణ్ణ

రాయచూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డ్యూటీ కేటాయింపునకు సంబంధించి మహిళా హోంగార్డ్ నుంచి లంచాన్ని స్వీకరిస్తుండగా హోంగార్డ్ కమాండర్ ఒకరు లోకాయుక్తకు పట్టుబడ్డాడు. జిల్లాలో పని చేస్తున్న హోంగార్డ్ కమాండర్ జంబణ్ణ.. ఒకరికి డ్యూటీ కేటాయింపునకు సంబంధించి రూ.10వేలు లంచం డిమాండ్ చేయగా దాన్ని బాధితురాలు లోకాయుక్త దృష్టికి తెచ్చారు. దీనిపై విచారణకు సిద్ధమైన లోకాయుక్త హోంగార్డ్ ద్వారా రూ.5వేలు లంచం తీసుకుంటుండగా జంబణ్ణను మంగళవారం రాత్రి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ప్రస్తుతం జంబణ్ణ లోకాయుక్త సతీశ్ వద్ద విచారణను ఎదుర్కొంటున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

మాన్విలో రైతుల ఆందోళన



రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న రైతులు

రాయచూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జొన్నల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉధృత రూపం దాల్చింది. రెండు రోజుల నుంచి సింధనూరులో జరుగుతున్న పోరాటానికి మద్దతుగా బుధవారం మాన్వి పట్టణంలోని రైతులు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి వచ్చి నిరసనలు తెలిపారు. జనతాదళ్(ఎస్) నేతృత్వంలో ఆందోళనకు దిగిన రైతులు రోడ్ల పై బైఠాయించి నిరసనను తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన దగ్గరకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయకపోతే తమ పార్టీ రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు.

కొత్త ఏడాదికి సర్వం సిద్ధం

విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం

పలు కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వ యత్నం

ధర్మవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను సకల సౌకర్యాలతో విద్యార్థులకు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వైసీపీ పాలనలో గాడి తప్పిన విద్యా వ్యవస్థను చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా కార్యక్రమాలు రూపొందిస్తోంది. ప్రతి తరగతికి ఒక ప్రత్యేక గది, ఒక ఉపాధ్యాయుడితో ఆదర్శపాఠశాలలు ఏర్పాటు చేస్తోంది. 6, 7, 8 తరగతులలో పిల్లల సంఖ్య 60 కంటే ఎక్కువ ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నతపాఠశాలగా మార్చింది. బాలికలు పదో తరగతి వరకు సొంతూరులోనే చదువుకునే వీలు కల్పించింది. పాఠశాలలు తెరిచిన మొదటి రోజే ప్రతి విద్యార్థికి యూనిఫామ్, రెండు జతల బూట్లు, బెల్టు, టైతో పాటు ఉచితంగా పుస్తకాలను అందజేయడానికి ఇప్పటికే విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా విద్యావ్యవస్థ మెరుగుదలకు ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలను రూపొందించింది.

వివరాలు ఇలా...

- జూన్ 6 నుంచి 19వరకు బడిబాట నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలన్నీ బలోపేతం చేయడం, విద్యార్థులను చేర్చుకోవడం కోసం విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.



కొత్తచెరువు ప్రాథమిక పాఠశాల

- 6న గ్రామసభ నిర్వహించి బడిఈడు పిల్లల్ని బడిలో చేర్చడం, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై చర్చిస్తారు.
- 7న గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి బాలబాలికల్ని గుర్తించాలి.
- 8 నుంచి 10వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థికి సమకూరే సౌకర్యాలతో కరపత్రాలను ముద్రించి ఇంటింటా ప్రచారం చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలి. బడి మానేసిన పిల్లల్ని గుర్తించి తిరిగి చేర్పించేలా చేయాలి. ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి దగ్గరలోని భవిత కేంద్రానికి పంపాలి.
- 11న మొత్తం కార్యక్రమాలను సమీక్షించడం, లోటుపాట్లను సరిచేసుకోవాలి.
- 12న పునఃప్రారంభం రోజునే పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి.
- 13న సామూహిక అక్షరాభ్యాసాలు, బాలల సభ.
- 16న ఎల్‌ఐపీ కార్యక్రమం
- 17న విలీన విద్య, బాలికా విద్యా దినోత్సవం ఆచరించాలి.
- 18న డిజిటలీకరణ, మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన పెంచాలి.
- 19న ముగింపు కార్యక్రమంగా వివిధ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలి.

ఆర్థిసాయం కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు 2025 సంవత్సరానికి సంబంధించి సీసీఎస్ ద్వారా అందించే ఆర్థిక సాయం (వృద్ధాప్య సాయం) కోసం ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సీఈసీఎస్‌లో కనీసం ఐదేళ్ల సర్వీసు, 63 ఏళ్లు నిండినవారు అర్హులన్నారు. ఆర్టీసీ భద్రతా పథకంలో సభ్యులుగా ఉన్నవారు అనర్హులన్నారు. ఆసక్తి, అర్హత గలవారికోసం అనంతపురం డిపో వద్ద దరఖాస్తులను ఉచితంగా అందజేస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 30వతేదీలోపు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9985431084 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

పర్యావరణం

పర్యావరణ హితంతోనే జీవుల మనుగడ

పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల కృషి

బోడిగుట్టలను వనరులుగా మార్చిన తనకల్లు గిరిజనులు

ప్లాస్టిక్ అంతమే ఈ ఏడాది నినాదం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రకృతి ప్రశాంతంగా ఉంటే జీవుల మనుగడ సాఫీగా సాగుతుంది. అదే ప్రకోపిస్తే విలయమే. నానాటికి పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకృతిలో భాగమైన పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. జనాభా పెరుగుదలతో విచ్చలవిడిగా అడవులను నరికివేసి భూములను ఆక్రమిస్తున్నారు. ఈక్రమంలోనే మానవజాతితో పాటు పశుపక్ష్యాదులతోపాటు, వన్యమృగాలు సైతం విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం ప్రారంభించాయి. అందులో భాగంగానే అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఆ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పర్యావరణ పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


ముండ్లవారిపల్లి వద్ద పరుచుకున్న పచ్చదనం

తనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సహజవనరుల సంరక్షణ కోసం తనకల్లు మండలంలోని గిరిజనులు గత 30 ఏళ్లుగా శ్రమిస్తున్నారు. మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండా, ముండ్లవారిపల్లి, దండువారిపల్లి, పెద్దపల్లి, వడ్డుమరవపల్లి, మార్పురివాండ్లపల్లి, నాయనిచెరువుపల్లి, జామ్లానాయక్‌తండా తదితర గ్రామాల ప్రజలు తమ గ్రామాల చుట్టూ ఉన్న బోడి గుట్టలను మూడు దశాబ్దాలుగా అభివృద్ధి చేసి, ఉత్పదకతనిచ్చే వనరులుగా మార్చుకున్నారు. ఒకప్పుడు


పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

ఎందుకు పనికిరాని బోడిగుట్టల్లో ట్రెంచ్‌లు కొట్ట, రాళ్లతో కట్టడాలు కట్టి, వాన నీటి వేగాన్ని నియంత్రించారు. తద్వారా మట్టి కొట్టుకుపోకుండా కాపాడుకున్నారు. మొక్కలు నాటి, సంరక్షించడంతో బోడిగుట్టల్లో పచ్చ దనం పరుచుకుంది. వేసవిలో తమ గుట్టలకు అగ్నికి ఆహుతవకుండా కార్యక్రమాలు చేపట్టారు. మేకలతో పచ్చదనానికి నష్టం వాటిల్లుతుందని భావించిన గ్రామాల గిరిజనులు సమష్టి నిర్ణయంతో వాటిని అమ్మేసి, గొర్రెలతో జీవనం సాగిస్తున్నారు. తాము కాపాడుకుంటున్న ఈ గుట్టలు, అడవిపై హక్కు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రెవెన్యూ అధికారులు మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండాల్లోని 90మంది మహిళలను ఒక సంఘంగా ఏర్పాటు చేసి, యూజ్‌ఆఫ్‌రైట్ హక్కును కల్పించారు. దీంతో మహిళలు ఈ అడవిని కాపాడుకోవడంలో మరింత శ్రద్ధ పెడుతున్నారు. ఆక్రమంలోనే అడవి రకక్షణకు ఓ వాచర్‌ను కూడా నియమించుకున్నారు. దీంతో ఈప్రాంతంలో పచ్చదనం పరుచుకుంది. ఇలా ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం తమ ప్రాంతంలోని అడవుల ను స్వచ్ఛందంగా కాపాడుకునేలా మండలంలో పనిచేసే జనజాగృతి సంస్థ తమ సహాయ, సహకారం అందించింది. దీంతో మండలంలో వందలాది ఎకరాల్లో అడవుల్లో పచ్చదనం పెరిగింది. ప్రస్తుతం ఈ అడవుల నుంచి పశువుల మేత, ఎండు కట్టెలు, ఆకులు, వనమూలికలు, పండ్లు, కాయలు, తదితరవాటిని సేకరించుకుంటున్నారు. ఈఅడవుల్లో వందలాదిగా జింకలు, నేమళ్లు, వివిధ రకాల పక్షులు, అటవీ జంతువులున్నాయి.



30 ఏళ్ల కృషి



30 ఏళ్ల కిందట మా గ్రామం వద్ద ఉన్న బండారివానిగుట్ట, నారాయణప్ప సరవ, వేమన చేను, వడ్డేళ్ల చేను, ప్రాజెక్టు గుట్ట, ఈప్రాంతాల్లో ఎలాంటి చెట్లు లేకుండా బీడు గుట్టలు ఉండేవి. అలాంటి గుట్టలను జనజాగృతి సహకారంతో ప్రజలందరం ఏకమై రక్షించుకోవడంతో నేడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నేటికి కూడా గుట్టల్లో అగ్ని పడితే స్వచ్ఛందంగా ఆర్పుతున్నాం. ఇప్పటికే మేము చేపట్టిన అటవీ పెంపకాన్ని ఎంతో మంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.

-పారేసునాయక్, రైతు, మొగిలిచెట్లతండా

జింకలు నాతో వచ్చేవి



30 ఏళ్ల కిందట ఒక మొక్కకూడా లేని ఈగుట్టల్లో జనజాగృతి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. గుట్టలు బాగా అభివృద్ధి చెందాక జింకలు, నెమళ్లు వచ్చాయి. నేను కట్టె చేతపట్టుకుని అడవిలో నడుస్తుంటే జింకలు నాతో పాటు నడిచేవి. మా గ్రామంవద్ద ఉన్న అడవిలో అన్నిరకాల చెట్లు ఉన్నాయి. అటవీ సంరక్షణ చేపట్టినప్పుడే ఆప్రాంతంలో వ్యవసాయంకూడా బాగుటుంది. అడవులు బాగుంటే కరువు కూడా వచ్చే అవకాశం ఉండదు.

-గంగులప్ప, అడవి కాపలాదారుడు, మొగిలిచెట్లతండా

పచ్చదనం కోసం కృషి

జిల్లాలో 33శాతం భూభాగాన్ని పచ్చదనంతో నింపడానికి కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 14శాతం రిజర్వు ఫారెస్టు, 6శాతం పండ్లతోటలు, ఆగ్రో ఫారెస్టు, ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనంతో నిండి ఉంది. ప్రస్తుతం జిల్లాలో 1,25,500 హెక్టార్లో పచ్చదనముంది. ఇంకా 1.20లక్షల హెక్టార్లలో పచ్చదనం తీసుకురావాల్సి ఉంది.



ఇందుకోసం ఉద్యాన తోటలు, ఆగ్రో ఫారెస్టు, ఉమ్మడి భూముల సంరక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. 2030-35నాటికి భూభాగంలో 33శాతం పచ్చదనం కోసం కృషి చేస్తున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా మొక్కలను నాటుతున్నాం.

-చక్రపాణి, డీఎఫ్‌ఓ, శ్రీసత్యసాయి జిల్లా

ప్లాస్టిక్ అంతమే లక్ష్యం

అనంతపురం క్లాక్‌టవర్/బుక్కపట్నం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జీవుల మనుగడకు పెను సవాల్‌గా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించడమే ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ నినాదంగా తీసుకువచ్చారు. ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ప్రతి ఏటా ఏదో ఒక అంశంతో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఏడాది ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించాలనే అంశాన్ని నినాదంగా తీసుకువచ్చింది.

1.5లక్షల మొక్కలు నాటుతాం



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధి హామీ పథకం కింద వనమహోత్సవంలో 1.5లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. 2353 ఫారంపాండ్ గట్ల మీద కొబ్బరి, మామిడి, నిమ్మ, మునగ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలు నాటాలి. బౌండ్రీ ప్లాంటేషన్ కింద హార్టికల్చర్, ఇతర రైతుల పొలం గట్లపై టేకు, శ్రీగంధం, మహాగని మొక్కలు నాటుతాం. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, దేవదాయ భూములలో రావి, వేప, మర్రి, జువ్వి, కానుగ, చింత, ఉసిరి, నేరుడు వంటి మొక్కలు నాటుతాం.

- సలీంబాషా, డ్వామా పీడీ

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను

పుట్టపర్తికి పొడిగించాలి

శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగుల డిమాండ్

అనంతపురం న్యూటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం-మచిలీపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును పుట్టపర్తి వరకు పొడిగించాలని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగులు.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. బుధవారం అనంతపురంలో బెంగళూరుకు మెము రైలు ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీని ఉద్యోగులు కలిశారు. వారు మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు తర్వాత అనంత నుంచి తమను పుట్టపర్తికి బదిలీ చేశారన్నారు. పుట్టపర్తిలో నివాసం ఉండాలంటే పిల్లలకు విద్యాసదుపాయాలు కూడా లేవన్నారు. దీంతో అనంతపురం నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. 600మంది వరకు ఉద్యోగులు రోజూ రాకపోకలు సాగిస్తున్నారన్నారు. బస్సు, రైలు సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో ధర్మవరం, మచిలీపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును పుట్టపర్తి వరకు పొడిగిస్తే కొంతవరకు సమస్య తీరుతుందన్నారు. అనంతపురం, బెంగళూరు మధ్య కొత్తగా వేసిన మెము రైలు ఉదయం ఉదయం 8 గంటలకు బయల్దేరేలా చూడాలన్నారు. ఇది ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పేరూరు డ్యాంకి నీరిచ్చే పనులు చేపట్టండి

నివేదికలు ఇవ్వండి.. హంద్రీనీవా అధికారులకు

ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురంరూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి జలాశయం నుంచి పేరూరు అప్పర్ పెన్నార్ (పరిటాల రవీంద్ర సాగునీటి పథకం) జలాశయానికి నీరందించే పనులు పునః ప్రారంభించాలని హంద్రీనీవా అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి హంద్రీనీవా అధికారులతో పరిటాల సునీత బుధవారం సమావేశమయ్యారు. గతంలో పేరూరు జలాశయానికి నీరందించే పనులు కొంతవరకు చేశామన్నారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుత పరిస్థితి గురించి నివేదికలు పంపాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, పరిహారం పంపిణీపై వివరాలివ్వాలన్నారు. త్వరలోనే ఆర్థిక శాఖ మంత్రిని కలిసి పరిహారం వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్, ఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తగ్గిన వరద


బొమ్మనహాళ్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందించే జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం జలాశయానికి ఇన్‌ఫ్లో 8,222 క్యూసెక్కులకు తగ్గిందని టీబీ బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1599.15 అడుగుల నీటి మట్టం, నిల్వ 20.45 టీఎంసీలు ఉందని పేర్కొన్నారు. శివమొగ్గ, అగుంబె, హరిహర ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతోనే జలశయానికి వరద తగ్గింది.

చెరువులకు మహర్దశ

తీరనున్న తాగు, సాగునీటి అవసరాలు

ఇంజనీర్ల కొరతతో ప్రతిపాదన తయారీలో జాప్యం

● అభివృద్ధికి ప్రభుత్వాల నిర్ణయం ● మొదటి దశలో 500కిపైగా చెరువులకు మోక్షం


గుత్తి చెరువు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత వనరులైన చెరువులకు మహర్దశ పట్టనుంది. చెరువుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. కేంద్ర జలశక్తి అభియాన్ ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధానమంత్రి కృషి సంచార్ యోజన (పీఎంకేఎస్‌వై)-హర్ ఖేత్‌కో పానీ (హెచ్‌కేకేపీ) పేరుతో చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు ఇవ్వనున్నాయి. చెరువులను పటిష్ఠంగా మార్చి, సామర్థ్యం పెంచి, మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఉమ్మడి జిల్లాలో 1,487 చెరువులు ఉండగా.. మొదటి దశలో 500కిపైగా అభివృద్ధి చేయనున్నారు. గత వైసీపీ హయాంలో కేంద్రం రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా.. రాష్ట్ర ప్రభుత్వం నిధుల్లేవని తిరస్కరించింది. కొత్త ప్రభుత్వం.. కేంద్రం ప్రతిపాదనకు అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించేందుకు సరే అంది. దీంతో చెరువుల అభివృద్ధికి చర్యలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇరిగేషన్‌లో ఇంజనీర్ల కొరతతో ప్రతిపాదనల తయారీలో ఆలస్యమవుతోంది.

నాలుగంచెల పద్ధతిలో ఎంపిక

నాలుగంచెల పద్ధతిలో చెరువులను ఎంపిక చేయనున్నారు. 2 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉండే చెరువును ఎంపిక చేస్తారు. వ్యయం కంటే రాబడి ఎక్కువగా ఉండేవాటికి ప్రాధాన్యమిస్తారు. జిల్లాస్థాయిలో మైనర్ ఇరిగేషన్ డివిజన్ ఇంజనీర్ కన్వీనర్‌గా ఉండే కమిటీలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ, గ్రౌండ్‌వాటర్ డీడీ, డ్వామా పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, సెంట్రల్ వాటర్ కమిషన్ మెంబర్, సెంట్రల్ వాటర్ బోర్డు మెంబర్ సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ, అక్కడి నుంచి రాష్ట్రస్థాయి నిధుల మంజూరు కమిటీ, అక్కడి నుంచి కేంద్రప్రభుత్వ చెరువుల అభివృద్ధి కమిటీకి ప్రతిపాదనలు పంపుతారు. కమిటీ ఎంపిక చేసిన చెరువులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులిచ్చి, అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు.

గత వైసీపీ ప్రభుత్వం నిరాకరణ

వైసీపీ హయాంలో చెరువుల అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. తన వాటా 40శాతం నిధులు చెరువుల అభివృద్ధికి ఇవ్వలేమంటూ వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో చెరువుల అభివృద్ధి పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయలేకపోయారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండు దఫాలు కేంద్రం నుంచి వచ్చిన ప్రతిపాదనలను తిరస్కరించారు. కేంద్రం నుంచి ఈ దఫా వచ్చిన ప్రతిపాదనను కొత్త ప్రభుత్వం స్వాగతించింది.

తొలి దశలో 500..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500 చెరువుల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 1,487 చెరువులున్నాయి. అనంతపురం జిల్లాలో 301, శ్రీసత్యసాయిలో 1,186 ఉన్నాయి. ఇప్పటి వరకు 90 చెరువుల ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా చెరువుల ప్రతిపాదనలు పంపిస్తే 500కిపైగా ఎంపికవవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బహుళ ప్రయోజనాలు

చెరువుల అభివృద్ధితో బహుళ ప్రయోజనాలున్నాయి. చెరువుల్లో ముళ్లకంపల తొలగింపు, పూడికతీత పనులు చేపట్టనున్నారు. దీంతో భూగర్భజలాల పెంపుతోపాటు వ్యవసాయం, చెరువు పరివాహక ప్రాంతాల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు చేపడతారు. చెరువు ఆయకట్టు మొత్తం సాగులోకి వచ్చే అవకాశం ఉంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. సాగు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. చెరువులను ఆహ్లాదకరంగా తయారు చేసి, గ్రీనరీని పెంచడం, పర్యాటకంగా అభివృద్ధి చేయడం ఇందులో భాగం.

వేధిస్తున్న ఇంజనీర్లు, సిబ్బంది కొరత

గత ఐదేళ్లుగా మైనర్ ఇరిగేషన్‌లో ఇంజనీర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. మైనర్ ఇరిగేషన్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈ, ముగ్గురు ఈఈలు, 15 మంది డీఈలు ఉన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేయించాల్సిన ఏఈలు 63 మందికిగాను 30మంది మాత్రమే ఉన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లష్కర్లు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. ఇంజనీర్లు, సిబ్బంది కలిపి 600 మందికిపైగా ఉండాలి. 207మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఆదేశించిన చెరువుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయడంలో ఆలస్యమవుతోందని ఆ శాఖ ఇంజనీర్లు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.


మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం

చెరువులను పటిష్టపరుస్తాం



చెరువుల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. మూడు నెలల్లో ప్రభుత్వాల అనుమతితో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. ఇంజనీర్లు, ఉద్యోగుల కొరతతో ప్రతిపాదనల తయారీలో ఆలస్యమవుతోంది. రెండేళ్లలో చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. ఆ మేరకు పనులు పూర్తి చేస్తాం.

-విశ్వనాథ్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఉమ్మడి జిల్లా ఎస్ఈ

నాపై ఆరోపణలు నిరూపిస్తే

రాజకీయాలు వదులుకుంటా

నాస్థాయి వ్యక్తికాదనే ఇంతదాకా ఓపిక పట్టా..

వాస్తవాలు ప్రజలకు చెప్పాలనే నోరువిప్పా

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

అనంతపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ తనపై చేస్తున్న ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటానని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. భూఅక్రమార్కుడు.. ఆదినారాయణేనని ఆరోపించారు. ఆ వ్యక్తిది తన స్థాయి కాదనే.. ఇంతదాకా ఓపిక పట్టానన్నారు. వాస్తవాలు ప్రజలకు చెప్పాలనే మాట్లాడాల్సి వస్తోందని పల్లె స్పష్టం చేశారు. స్థానిక పీవీకేకే కళాశాలలో మాజీ మంత్రి పల్లె బుధవారం మీడియాతో మాట్లాడారు. ఒకరి భూముల జోలికెళ్లాల్సిన అవసరం తనకు లేదన్నారు. మూడు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నానన్నారు. ఎలాంటి మచ్చలేకుండా ప్రజలు, కార్యకర్తలకు సేవ చేస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ఎవరు కష్టాలు, బాధల్లో ఉన్నా.. ఆర్థికంగా సాయం చేస్తూ కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటున్నానన్నారు. విద్యాసంస్థల ద్వారా ఎంతోమందికి ఉచితంగా విద్య అందించడమే కాకుండా ఉద్యోగావకాశాలు కల్పించానన్నారు. ఇటీవల గొడ్డుమర్రి ఆదినారాయణ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా, కొంతమంది నాయకులకు వాస్తవాలు చెప్పకుండా తనపై అబాండాలు వేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నాడన్నారు. తాను భూకబ్జాదారుడని అసత్యప్రచారాలు చేస్తున్నారనీ, ఎక్కడైనా సెంటు భూమి కాజేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. నడిరోడ్డుమీదకు వచ్చి ప్రజలకు క్షమాపణలు చెబుతానన్నారు. దొంగే.. దొంగ అన్నట్లుగా ఆదినారాయణ తమ కంపెనీ భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకుని, తనపైనే ఆరోపణలు చేస్తున్నాడన్నారు. తాను భూములు ఆక్రమించి ఉండుంటే ప్రభుత్వమే సిట్ ఏర్పాటు చేసి, విచారణ చేసి, నిజానిజాలు నిగ్గుతేల్చి న్యాయం చేయాలని కోరుతున్నట్లు పల్లె వివరించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

యోగి ఆదిత్యనాథ్ (పుట్టినరోజు)



యోగి ఆదిత్యనాథ్ 1972 జూన్ 5న జన్మించారు. అసలు పేరు అజయ్ మోహన్ సింగ్ బిష్త్. 2017 నుంచి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఐదేళ్ళ పాలన పూర్తి చేసి మళ్ళీ సీఎం అయి రికార్డు సృష్టించారు. పన్నెండో లోక్‌సభకు 26వ యేటనే గోరఖ్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1998 నుంచి వరుసగా ఐదుసార్లు గెలుపొందారు. తొలిసారిగా గెలుపొందాక 'హిందూ యువ వాహిని'ని ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో హిందూత్వ ప్రచారానికి కృషి చేస్తున్నారు. గోరఖ్‌నాథ్ మఠాధిపతిగాను కొనసాగుతున్నారు. ఎంపీగా కంటే హిందూత్వవాదిగా పేరొందారు.

జాన్ మేనార్డ్ కీన్స్ (జయంతి)



స్థూల అర్థశాస్త్రానికి బాటలు వేసిన బ్రిటీష్ ఆర్థికవేత్త జాన్ మేనర్డ్ కీన్స్ 1883 జూన్ 5న కేంబ్రిడ్జిలో జన్మించారు. ఈటన్ కళాశాల, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయాలలో విద్య అభ్యసించారు. బ్రిటీష్ ప్రభుత్వంలోని ఇండియా కార్యాలయంలో పనిచేసి 'ఇండియన్ కరెన్సీస్ అండ్ ఫైనాన్స్' అనే గ్రంథాన్ని రచించారు. 1930 దశకంలో ఆర్థికమాంద్యం వంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేం దుకు కీలకమైన సలహా సూచనలు చేశారు. ఆయన రచించిన 'ది జనరల్ థియరీ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఇంటెరెస్ట్ అండ్ మనీ' అనే గ్రంథం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్'కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. రెండో ప్రపంచయుద్ధం సమయంలో 'హౌ టు పే ఫర్ ది వార్స్' అనే గ్రంథాన్ని రచించారు. 'ది ఎకనమిస్ట్' పత్రిక ఆయనను బ్రిటన్ దేశ 20వ శతాబ్ధపు గొప్ప ఆర్థికవేత్తగా పేర్కొంది. 1946 ఏప్రిల్ 21న కన్నుమూశారు.

ఓ హెన్రీ (వర్థంతి)



కలం పేరు 'ఓ హెన్రీ'తోనే పేరొందిన విలియమ్ సిడ్నీ పోర్టర్ 1862 సెప్టెంబరు 11న నార్త్ కరోలినాలో జన్మించారు. అమెరికాకు చెందిన ఆయన చిన్నకథల రచయిత. ఆయన కథలు ఆసక్తిగా ఉంటూ మలుపులు తిరుగుతూ ఆశ్చర్యకరమైన రీతిలో ముగింపు కలిగి ఉంటాయి. 381 చిన్నకథలు రాశారు. కవిత్వం లోనూ, నాన్ ఫిక్షన్‌లోనూ రాణించారు. 1910 జూన్ 5న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తించిన అమెరికా ప్రభుత్వం ఉత్తమ చిన్న కథల రచయితలకు 'ఓ హెన్రీ పురస్కారం' ఇస్తోంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె నుంచి తాటిచెర్ల రైల్వే స్టేషన్ మధ్యలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీ కొని మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. 45 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. ట్రాక్ దాటుతునే సమయంలో రైలు ఢీ కొనడంతో శరీర భాగాలు చెల్ల చెదురయ్యాయన్నారు. షర్ట్ పై మాత్రం ప్రీమియర్ అని ఉందన్నారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు. వివరాలకై ఎస్‌ఐ వెంకటేష్ 9441445354, హెడ్ కానిస్టేబుల్ దామోదర్ 7013308693 లను సంప్రదించవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి

అనంతపురం సెంట్రల్/విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటక సరిహద్దు వద్ద భారత్ పెట్రోలు బంక్ సమీపాన బుధవారం మధ్యాహ్నం కారును గ్యాస్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి (50) మరణించారు. స్థానికులు, విడపనకల్లు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామమూర్తి అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండేవారు. వ్యక్తిగత పని మీద అనంతపురం నుంచి బళ్లారికి కారులో బయల్దేరారు. ఉరవకొండ-అనంతపురం 42వ జాతీయ రహదారిపై బళ్లారి నుంచి అనంతపురం వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. ఆయనను బయటకు తీసి విడపనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మరణించారు.

ప్రాజెక్టుల రూపకల్పనతో విద్యార్థిలో కొత్త ఆలోచనలు

» రాజగోపాలకృష్ణ

బెంగళూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రాజెక్టుల రూపకల్పన కేవలం ఒక అసైన్‌మెంట్ కాదని, వారిలో కొత్త ఆలోచనలకు మార్గదర్శకమని అకాలియా టెక్నాలజీస్ కంపెనీ కో ఫౌండర్ రాజగోపాలకృష్ణ అభిప్రాయపడ్డారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రాజెక్టుల ప్రదర్శనను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇదే కళాశాల పూర్వ విద్యార్థినని, మీ తరహాలోనే ఓ ప్రాజెక్టు రూపొందించినందుకు అమెరికాలో ఉద్యోగం ఆఫర్ వచ్చిందన్నారు. విద్యార్థులు ప్రయోగాలు, ఆవిష్కరణల విషయంలో ఆసక్తి చూపాలన్నారు. ఇదో మహత్తర అవకాశంగా భావించాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో కుతూహలం రూపొందించుకోవాలని, అప్పుడు మాత్రమే కొత్త ఆలోచనలకు నైపుణ్యత సాధించేందుకు వీలవుతుందన్నారు. నేర్చుకోవడం అనేది నిరంతరం అని ప్రతిరోజూ అభ్యాసం చేయాల్సిందే అన్నారు. ఏఐ వచ్చిన తర్వాత సులభతరం కోసం కంపెనీలు ఎదురుచూస్తున్నాయని, అందుకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ఎంఆర్ కోదండరామ్ మాట్లాడుతూ జీవితంలో అత్యంత విలువైనది నైపుణ్యత అని ఎవరూ దీన్ని తస్కరించలేరన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యతను రూపొందించుకోవాలన్నారు. ప్రాజెక్టుల ద్వారా కొత్త ఆలోచనలు వస్తాయనే, ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు 430 ప్రాజక్టులు రూపొందించారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎంఆర్ జానకిరామ్, డైరెక్టర్‌లు ఎంఆర్ సంపంగిరామయ్య, ఎంఆర్ కోదండరామ్, ప్రిన్సిపాల్ ఎన్‌వీఆర్ నాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్‌వీ పార్శ్వనాథులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న రాజగోపాలకృష్ణ

ప్రమాదాల నివారణకు చర్యలు: ఎంపీ



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎంపీ మల్లేశ్‌బాబు

బంగారపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ కారిడార్‌పై ఇటీవల పలు ప్రమాదాలు చోటు చేసుకోవడంపై ఎంపీ మల్లేశ్ బాబు, జాతీయ రహదారి ప్రాధికార అధికారులతో కలసి పరిశీలన చేపట్టారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో అధికారులతో కలసి పరిశీలించామన్నారు. ఈ మార్గంలో కేవలం లారీ, బస్సు, కారు, ఇతర వాహనాలకు మాత్రమే అవకాశం ఉందని, అయితే ద్విచక్ర వాహనం, ఆటో, ట్రాక్టర్‌ల సంచారానికి అవకాశం లేదన్నారు. అకస్మాత్తు భారీ వాహనాల వల్ల చిన్న వాహనాలకు ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ మొత్తంతోపాటు ఇతరత్రా సౌలభ్యాలు సాధ్యం కావన్నారు. అందుకే బైక్, ఆటో, ట్రాక్టర్‌లను ఈ మార్గంలో నడపరాదన్నారు. సుమారు 70 కిలోమీటర్ల మార్గంలో ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర సేవలకోసం 3 అంబులెన్స్, 3 హెల్త్‌లైన్ వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఒక్క కిలోమీటరు దూరంలో సీసీ కెమెరాతోపాటు ఎస్‌ఓఎస్ దూరవాణి బాక్స్ ఉందన్నారు. అత్యవసరవేళ దీన్ని ఉపయోగించవచ్చునన్నారు. ఈ మార్గంలో సంచరించే వాహనాలు బ్రేక్ డౌన్ అయినా, పెట్రోల్, డీజిల్ ఖాళీ అయితే ట్రోల్‌ఫ్రీ నెంబరు 1033కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. రోడ్డు బాగుంది కదా అని 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్లడం సరికాదన్నారు.

త్వరలోనే టోల్ ప్రారంభం

టోల్ గేట్ వసూలు చేయడం మరో రెండు నెలల్లో ప్రారంభించే అవకాశాలు ఉన్నాయన్నారు. టోల్ ప్రారంభమైతే జాతీయ రహదారి ప్రాధికార గస్తీ వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి ప్రాధికార యోజనా డైరెక్టర్ అర్చనా, ఇంజనీర్ మనోజ్ తదితరులు ఉన్నారు.

ఇందిరా క్యాంటీన్ ప్రారంభం

దొమ్మసంద్ర, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా అత్తిబెలె పురసభ వెనుక భాగాన నిర్మించిన ఇందిరాక్యాంటీన్‌ను రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే బీ శివణ్ణ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అత్తిబెలె పారిశ్రామికవాడలో కార్మికులు, కూలికార్మికులు అధికమన్నారు. వారికి తక్కువధరతో నాణ్యమైన ఆహారం అందించే ఉద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం ఇందిరాక్యాంటీన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇదే సందర్భంగా అత్తిబెలె పురసభలో పనిచేసే సిబ్బందికి బీమా పథకం బాండ్లను పంపిణీ చేశారు. దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలను, ప్రజలకు బి ఖాతాలను అందచేశారు. ఇదే సందర్భంగా పలువురు ప్రముఖులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో పురసభ ముఖ్యాధికారి మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

17 ద్విచక్రవాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసు సిబ్బంది

బంగారపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బంగారపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి సుమారు రూ.18.60లక్షల విలువైన 17 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఆర్ దయానంద్ నేతృత్వంలో కార్యాచరణ నిర్వహించారు. ఈనెల 1న హరికృష్ణ బంగారపేట పట్టణం రైల్వేస్టేషన్ సమీపాన పార్కింగ్‌లో ఉంచిన తన ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇటీవలికాలంలో ద్విచక్రవాహనాల చోరీలు అధికమయ్యాయని తీవ్రంగా పరిగణించాలని డీఎస్పీ ఎస్ పాండురంగ సూచించారు. ఎస్సై వీ రాజణ్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కార్యాచరణలో చిత్తూరు జిల్లా వాసి చంద్రచారి (38)ని అరెస్టు చేసి విచారించగా బంగారపేట, బేతమంగల, కమ్మసంద్ర, ముళబాగిలు, హొస్కోటె, సరిహద్దులోని కుప్పం తదితర ప్రాంతాలలో వాహనాలు చోరీ చేసిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితుడి నుంచి 17 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కార్యాచరణలో సీఐ ఆర్ దయానంద్, ఎస్సై ఎస్‌వీ రాజణ్ణ, సిబ్బంది మంజునాథ్, గజేంద్ర, విజయకుమార్, మధుకుమార్, సునీల్, సంతోష్, సిద్దాపు తదితరులు పాల్గొన్నారు. సిబ్బందిని జిల్లా ఎస్పీ కేఎం శాంతరాజు ప్రశంసించారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

దొమ్మసంద్ర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సుధామనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నవజ్యోతి కన్నడ కళాసంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత సామగ్రి పంపిణీ చేశారు. స్కూల్‌బ్యాగ్, నోటుబుక్స్, పెన్ ఇతరత్రా అందచేశారు. సంఘం ఆధ్వర్యంలో ఏటా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ఇస్తున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడుతూ చక్కగా చదువుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఉమాపతి, నగరాజ్, కోశాధికారి శ్రీనివాస్, డైరెక్టర్‌లు భువనేశ్వర్, హేమంత్‌కుమార్, కృష్ణమూర్తి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవింద రాజు, టీచర్ రవి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలతో విద్యార్థులు

విషాదం గురించి తెలియక.. చిన్నస్వామి స్టేడియంలో..!













భారీగా తరలివచ్చిన ఆర్‌సీబీ అభిమానులు

మాజీ సైనికులకు ఇంటిపన్ను మినహాయించండి

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు ఇంటి, ఆస్తి పన్నులో వందశాతం మినహాయింపు ఇవ్వాలని మాజీ సైనికుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు మాజీ సైనికుల సంఘం ప్రతినిధి ఈశ్వర్ రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాలలో మాజీ సైనికులకు ఆస్తి పన్నులో వందశాతం మినహాయింపు ఇచ్చారన్నారు. అదే విధానం కర్ణాటకలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

యోగా డే కోసం ఉచిత శిక్షణ

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరోగ్యమందిర ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా డే కోసం ఉచిత శిక్షణలు ఇస్తున్నట్టు యోగా నిపుణుడు బిఎస్ బ్రహ్మాచార్య తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజాజినగర్ ఇస్కాన్‌మందిరం సమీపంలోని ఆరోగ్యమందిర ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉచిత శిక్షణలు ఇస్తున్నామన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. మే 21న శిక్షణలు ప్రారంభమయ్యాయని ఈనెల 21 వరకు శిక్షణలు కొనసాగుతాయన్నారు. ఆసక్తిగలవారు శిక్షణలో పాల్గొనవచ్చునన్నారు. యోగా డే రోజున సులభతరంగా ఆసనాలు, విన్యాసాలు చేసేందుకు వీలుగా శిక్షణలు ఇస్తామన్నారు.

7న ఉదయం ఈద్ నమాజ్

బాగేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా పట్టణంలోని 15 మసీదుల పెద్దల ఫారూఖ్ మసీదులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 7న శనివారం ఉదయం 7.30 గంటలకు నమాజ్ నిర్వహించేలా తీర్మానించారు. ఈదుల్ జుహ (బక్రీద్) పండుగ త్యాగబలిదానాల ప్రతీకగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న ముస్లింల ఆచారం. శుక్రవారం ఉపవాసం ఉండి శనివారం ఈద్ జరుపుకోవాలని నిర్ణయించారు. శనివారం ఉదయం ఒకవేళ వర్షం కురిస్తే స్థానిక మసీదులలోనే ప్రార్థనలు చేసుకోవాలని తీర్మానించారు.

రేపట్నుంచే డీఎస్సీ పరీక్షలు

- గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలి..
- జిల్లాలో 8, బెంగళూరులో 2 ఏర్పాటు

అనంతపురం విద్య, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025(ఏపీ టీచర్స్ రిక్రూట్‌మెంట్) పరీక్షలు రాసే అభ్యర్థులు గంటన్నర ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. పరీక్షలు ఈనెల 6న ప్రారంభం అవుతాయని బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 30వతేదీ వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ నిత్యం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షాకేంద్రాలు అనంతపురంలో 5, తాడిపత్రి, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున, బెంగళూరులో రెండు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 8 కేంద్రాలు, బెంగళూరులోని 2 కేంద్రాల్లో కలిసి 45,816 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతోపాటు, వైద్యసేవల కోసం ఏఎన్‌ఎంలను కూడా నియమించామన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు, గుర్తింపుకార్డులతో గంటన్నర ముందుగానే కేంద్రాలకు హాజరు కావాలన్నారు. హాల్ టికెట్‌లో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు ఇతర ఏవైనా తప్పులుంటే అభ్యర్థులు వారి ఒరిజినల్ 10వ తరగతి సర్టిఫికెట్, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరీక్షాకేంద్రంలో ఉండే డిపార్టుమెంటల్ ఆఫీసర్(డీఓ)కు అందజేస్తే, సవరించడానికి ఉన్నతాధికారులకు పంపే వెసులుబాటు ఉంటుందన్నారు. డీఎస్సీ పరీక్షా కేంద్రాల చిరునామా కోసం http://deoanathapuram u.blogspot.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 6న నిర్వహించనున్నట్లు జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక, ప్రణాళిక స్టాండింగ్ కమిటీ-1, వర్క్యులు స్టాండింగ్ కమిటీ-7, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ-2, విద్య, వైద్యసేవలు స్టాండింగ్ కమిటీ-4 సమావేశాలు జడ్పీ మెయిన్ హాల్‌లో, మహిళ, శిశు సంక్షేమం స్టాండింగ్ కమిటీ-5, వ్యవసాయం స్టాండింగ్ కమిటీ-3, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ-6 సమావేశాలు జడ్పీలోని అదనపు మీటింగ్ హాల్‌లో జరుగుతాయన్నారు. 6న ఉదయం 10.00 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు.

భూమి విషయమై రగడ.. 75 మందిపై కేసు

అనంతపురం క్రైం, జూన్4(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగర సమీపంలోని భూ వివాదాల్లో జరిగిన రెండు వేర్వేరు గొడవల్లో నాలుగో పట్టణ పోలీస్టేషన్‌లో 75మందిపై కేసు నమోదైంది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పరిధిలోని సర్వేనెంబరు 144/2ఏలో మొత్తం 1.76ఎకరాల్లో హనుమంతరెడ్డికి రూ.0.73సెంట్లు, సయ్యద్‌షామీర్‌కు 0.58సెంట్లు, గొల్ల విజయలక్ష్మికి 8సెంట్లు, ఇమాంబాషాకు 8సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో కాంపౌండ్‌వాల్, షెడ్డు, బోరు ఏర్పాటు చేసుకున్నారు. గత నెల 28న కొందరు వ్యక్తులు ఆ సర్వే నెంబరులోని 2ఏ మీది కాదని 2బీ ఉంటుందని దౌర్జన్యానికి దిగారు. ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీని కూల్చి వేశారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు బోయ కిష్టప్పతో పాటు 50మందిపై కేసు నమోదు చేశారు. మరో భూవివాదంలో అరవిందనగర్‌కు చెందిన వెంకటేష్‌ప్రసాద్ గుప్తా, అతని కొడుకులు ప్రణీత్, సాయినాథ్‌పై కొందరు కియ షోరూమ్ వెనుకవైపున దాడి చేశారు. ఈ ఘటనలో సాయినాథ్ చెవి పూర్తిగా దెబ్బతిందని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కోనాపురానికి చెందిన ఇంటూరి చెన్నారెడ్డితో పాటు 25మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో బాధితులు దాడికి పాల్పడిన వారిని పూర్తి స్థాయిలో గుర్తించలేకపోతున్నారని, విచారిస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. నిందితుల్లో అధికంగా టీడీపీ నాయకులు ఉన్నట్లు సమాచారం.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చల్లావారిపల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. బుధవారం సాయంత్రం లోకో పైలట్ విషయం చెప్పడంతో ఎస్‌ఐ అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడి వివరాలు తెలియరాలేదని ఎస్‌ఐ తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.15	1,577.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	8,222	659
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	247	25
నీటి నిల్వ (టీఎంసీలు)	20.45	3.46

ఘనంగా అభయాంజనేయస్వామి
ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో స్వామివారు

బళ్లారిరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధిచెందిన అభయ వరదాంజనేయస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. పూజల్లో హనుమంతుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పదాధికారులు సత్యనారాయణ, భీమేష్, లోకరాజు, నటరాజు, వీరేష్, గిరి, హరీష్, రాజశేఖరరెడ్డి, శ్రీరాములు, నగేష్ కుమార్, ప్రేమనాథ్ పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతించండి


డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న లారీ యజమానులు

బళ్లారి సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాను తిరిగి ప్రారంభించాలని లారీ యజమానులు, డ్రైవర్లు గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ద్వితీ, జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. రామాంజిని, వీరేశ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఇసుక రవాణాకు అనుమతి ప్రభుత్వం అనుమతించలేదన్నారు. చట్టబద్ధంగా తవ్విన ఇసుక రవాణాకు ఆటంకం కారణంగా లారీల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు పని లేకుండా పోయిందన్నారు. ట్రక్కుల రుణ వాయిదాలు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇసుక రవాణాపై ఆధారపడిన వాహన యజమానులు, డ్రైవర్లు క్లీనర్ల జీవనోపాధి కోసం చట్టబద్ధంగా ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, సురేశ్, రాజ్ కుమార్, చంద్ర పాల్గొన్నారు.

కమల్‌హాసన్ క్షమాపణ చెప్పాలి


ధర్నా చేస్తున్న కర్ణాటక రక్షణ వేదిక సభ్యులు

బళ్లారిరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు ఉలగప్ప, రాష్ట్ర సంచాలకుడు అర్ధగిరి రామన్న ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి రాయల్ సర్కిల్ వద్ద కమల్‌హాసన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. బుధవారం కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి రాయల్ సర్కిల్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు మనవిపత్రం అందించారు. ఉలగప్ప మాట్లాడుతూ కన్నడ భాషను కించపరుస్తూ మాట్లాడిన కమల్‌హాసన్ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రామన్న మాట్లాడుతూ కమల్‌హాసన్ మాటలు కర్ణాటకలో ఆయన చిత్రాలను నిషేధిస్తామని హెచ్చరించారు. అసొండి సూరి, వెంకటేష్, తిమ్మప్ప, పరమేష్, ఆనంద్, సిద్దప్ప, పరశురాం, దుర్గాప్రసాద్, సిద్దేష్, పలు రక్షణ వేదిక పదాధికారులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో బెస్ట్ విద్యార్థి ప్రతిభ


సయ్యద్ మహమ్మద్ మాహిర్

బళ్లారి సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో బెస్ట్ కళాశాల విద్యార్థి సయ్యద్ మహమ్మద్ మాహిర్ రాష్ట్రస్థాయిలో 12,953వ ర్యాంక్ సాధించినట్లు సంస్థ అధ్యక్షుడు కోనంకిరామప్ప తెలిపారు. ర్యాంకు సాధించిన విద్యార్థిని అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్ కుమార్, కార్యదర్శి మన్నె శ్రీనివాసులు కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సిబ్బంది అభినందించారు.

సండూర్‌లో పచ్చదనాన్ని పెంపొందిద్దాం: ఎమ్మెల్యే అన్నపూర్ణ


దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

బళ్లారి సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సండూర్‌లో పచ్చదనాన్ని పెంపొందిద్దామని ఎమ్మెల్యే అన్నపూర్ణ అన్నారు. ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన సమాజంలో ఎవరూ ధనవంతులు లేరని, అందరూ పనిచేసి జీవిస్తున్నారన్నారు. సండూర్‌లో ట్రక్కుల రాకపోకలు చాలా ఉన్నాయని, ముఖ్యంగా దివ్యాంగులు ట్రాఫిక్ చట్టాలను పాటించి అవగాహనతో నడుచుకోవాలన్నారు. సండూర్ ఎల్లప్పుడూ పచ్చదనంతో నిండిఉండేదని, కానీ మైనింగ్ కారణంగా చెట్లను పెంచడంలో వెనకబడిందన్నారు. దానిని పరిష్కరించడానికి మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది మంచి వాతావరణాన్ని కాపాడటానికి సహాయపడుతుందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడటం ద్వారా మనకు మంచి ఆక్సిజన్ లభిస్తుందన్నారు. అలాగే అంబేడ్కర్ సంఘానికి 702 కుర్చీలు, దివ్యాంగులకు 8 సైకిళ్లు, వాల్మీకి సంఘానికి 695 కుర్చీలు, ఇతర పరికరాలు, టౌన్‌హాల్‌కు 185 కుర్చీలు, మొత్తం 1582 పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ముఖ్య అధికారి జయన్న, అధ్యక్షుడు సిరాజ్ హుస్సేన్, లత, శివకుమార్, సురేశ్, అబ్దుల్లా, హనుమేశ్, బ్రహ్మయ్య, ఆశాలత, లక్ష్మీదేవి, దీప ఘోర్పడె, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ బదిలీలు ప్రారంభం

- ఎనిమిది మంది తహసీల్దార్లకు స్థానచలనం
- ఉత్తర్వులు విడుదల చేసిన కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో బదిలీలు మొదలయ్యాయి. తొలుత ఈనెల 2వ తేదీలోగా బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో అత్యంత కీలకమైన రెవెన్యూలో బదిలీలపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఈ బదిలీలకు ఈనెల 9వ తేదీ వరకు గడువు పొడిగించింది. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్, జేసీ, డీఆర్వోలు.. రెవెన్యూ శాఖలో బదిలీలపై దృష్టిపెట్టారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పడినపుడు బదిలీలు చేసినా నిబంధనలను సాకుగా చూపి, ప్రజాప్రతినిధులు సూచించిన వారిని జిల్లా ఉన్నతాధికారులు నియమించలేకపోయారు. దీనిపై అప్పట్లో కొంతమేర వివాదం తలెత్తడంతో ఆ తర్వాత కొంతమందిని మార్పులు చేస్తూ వచ్చారు. ఈసారి బదిలీల్లో జిల్లాయంత్రాంగం ఆచితూచి అడుగులు వేసినట్లు ప్రస్తుతం తహసీల్దార్ల బదిలీలను బట్టి తెలుస్తోంది.

తహసీల్దార్లతో ప్రారంభం

రెవెన్యూశాఖలో తొలుత తహసీల్దార్ల బదిలీలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఎనిమిదిమంది తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ బుధవారం కలెక్టర్ వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల వ్యవహారాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. తెల్లవారుజామున జాబితాను విడుదల చేశారు. వీరందరూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీ అయ్యారు. వారికి మళ్లీ స్థానచలనం కల్పించారు.

మరో జాబితాపై ఉత్కంఠ

తహసీల్దార్ల బదిలీలు ఇంకా ఉన్నాయనే చర్చ రెవెన్యూ వర్గాల్లో సాగుతోంది. ప్రస్తుతం ఎనిమది మందికి మాత్రమే స్థానచలనం కల్పించారు. ఇంకా చాలామంది పట్ల ఆయానియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అసంతృప్తిగా ఉండడంతో బదిలీ చేయాలని సూచించినట్లు రెవెన్యూవర్గాలు చెప్పుకుంటున్నాయి. దీంతో తహసీల్దార్ల బదిలీల రండోజాబితాకూడా తప్పకుండా ఉంటుందని పెద్దఎత్తున చర్చ సాగుతోంది. దీనిపై ఉన్నతాధికారులు మౌనంగా ఉంటున్నారు.

మొక్కు తీర్చుకున్న ఆర్‌సీబీ అభిమానులు


స్వామివారికి మొక్కులు తీర్చుకునేందుకు సైకిల్‌పై వెళ్తున్న ఆర్‌సీబీ అభిమాని

కంప్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆర్‌సీబీ గెలుపు కోసం అభిమానులు తమ ఆరాధ్య దేవుళ్లకు మొక్కులు తీర్చారు. బెంగళూరుకు చెందిన ప్రాంక్ కన్నడిగుడు సైకిల్‌పై అంజనాద్రి పర్వతానికి చేరుకుని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి తన మొక్కు తీర్చుకున్నాడు. అలాగే బళ్లారికి చెందిన గని, యశ్, బళ్లారి నుంచి అంజనాద్రి పర్వతానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కంప్లికు చెందిన దివ్యశ్రీ బుక్కసాగర వద్ద ఏడుపడగల నాగప్పకు పంచామృత అభిషేకం చేయించారు. 18 సంవత్సరాల అనంతరం ఆర్‌సీబీ జట్టు గెలవడం ఆనందాన్ని కలిగించిందని అభిమానులు తెలిపారు.

ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలకు భారీ కటౌట్ ఏర్పాటు


అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కటౌట్

కంప్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఎమ్మెల్యే గణేష్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్‌లో వసకోటి జగదీష్ 60అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ, అన్నదానాలు చేపడుతున్నట్లు అభిమానులు తెలిపారు. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అభిమానులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.

ఆయుర్వేద ఆస్పత్రిని వినియోగించుకోండి: ఎమ్మెల్యే


ఆయుర్వేద ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఆయుర్వేదిక్ ఆస్పత్రి సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ కోరారు. బుధవారం కురుగోడు తాలుకా కోళూరు గ్రామంలో నిర్మించిన ఆయుర్వేదిక్ ఆస్పత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి దుష్ప్రభావాలు లేని ఆయుర్వేద ఆస్పత్రి సేవలను ప్రజలు సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. వైద్యవ్యవస్థలో అత్యుత్తమ చికిత్స ఉచితంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షురాలు దొడ్డబసమ్మ, ఉపాధ్యక్షుడు చెన్నప్ప, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎం విరుపాక్ష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేపీ కళ్యాణి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగికి గుర్తింపు


ఉస్మాన్ దంపతులను సన్మానిస్తున్న నగరసభ కమిషనర్ గురుప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది

సిరుగుప్ప, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరసభ కార్యాలయంలో 42 ఏళ్లపాటు ఉస్మాన్ సేవలు గర్వించదగ్గ విషయమని కమిషనర్ గురుప్రసాద్ అన్నారు. బుధవారం సిరుగుప్ప పట్టణం నగరసభ కార్యాలయ ఉద్యోగి ఉస్మాన్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉస్మాన్ దంపతులను కమిషనర్ సన్మానించారు. నగరసభ కార్యాలయంలో 42 సంవత్సరాలు సుదీర్ఘంగా సేవలు అందించడం గొప్ప విషయమని ఆయన చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేష్, నజీర్, ముస్లిం ప్రముఖులు అండీ హుస్సేన్ బాషా, అబ్దుల్ నబీ, నగరసభ ఇంజనీర్లు ప్రియాంక, ముర్షిద్‌బాను, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు సదుపాయాలు కల్పించండి


మాట్లాడుతున్న సత్యబాబు

కంప్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కట్టడ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కట్టడ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు డిమాండ్ చేశారు. కంప్లిలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్భవ గణపతి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పురసభ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. సత్తిబాబు మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో ఎంతోమంది కూలీలకు ఇంటి వసతులు లేక బాడుగ ఇళ్లలో జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వ సదుపాయాలు కల్పించాలని కోరారు. కట్టడకూలీ కార్మికులకు ఉచిత చదువులు, ఆరోగ్య బీమా పనులు తగ్గట్లు కూలీ ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకునే విషయంలో విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మున్ముందు కట్టడ కార్మికుల సమస్యలు పట్టించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవన్న, వన్నూరుసాబ్, బండి బసవరాజు, వన్నమ్మ, సరస్వతి, సుంకప్ప, నాగరాజు, సువర్ణమ్మ, అంజనమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మరమ్మతులు చేపట్టండి



బీఈఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ధనలక్ష్మి క్యాంప్ ప్రభుత్వ తెలుగు ప్రాథమిక పాఠశాలకు మరమ్మతు చేపట్టాలని, కన్నడ, ఆంగ్ల మాధ్యమ శిక్షణ ప్రారంభించాలని ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బీఈఓ కార్యాలయం ముందు పోషకులతో సహా బుధవారం నిరసన తెలిపారు. ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శాంతి మాట్లాడుతూ శంకరబండె వద్ద ధనలక్ష్మి క్యాంప్‌లో ఉన్నప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 17 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో మూడు భవనాలు ఉన్నాయని, ఒక గదికి పైకప్పు పడిపోయి దెబ్బతినిందన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల లేవన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన బీఈఓ వెంకటేశ్ స్పందిస్తూ భవనానికి మరమ్మతులు చేపడతామని, ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

దొంగ నోట్ల చలామణిలో పట్టుబడ్డ నిందితులు


పోలీసులకు పట్టుబడ్డ దొంగ నోట్ల చలామణి నిందితులు

రాయచూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నకిలీ నోట్లను ఏటీఎంలో పెట్టేందుకు యత్నించిన నిందితులను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలోని మాన్వి పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో వ్యక్తి ఒకరు నకిలీ నోట్లను తన బ్యాంక్ అకౌంట్‌కు జమా చేసే ప్రయత్నాన్ని గమనించిన బ్యాంక్ మేనేజర్ విషయాన్ని టౌన్ పోలీసుల దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 18 వేల విలువగల 36 రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సీకల్ సమీపంలోని చాహపుడి క్యాంప్‌కు చెందిన విరుపాక్షిగా గుర్తించారు. ఆయనతో పాటు నకిలీ నోట్ల చలామణిలో మరో 10 మంది భాగస్వామిగా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అందరిని అదుపులోకి తీసుకుని బుధవారం న్యాయ స్థానానికి అప్పగించారు.

కోనసాగరలో చిరుత కలకలం
- ఆవుదూడపై దాడి

బళ్లారి/గాంధీనగర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మొలకాల్మూరు తాలూకా కోనసాగర గ్రామ సమీపంలో చిరుత కలకలం రేపుతోంది. గ్రామ శివారులో ఉన్న కొండలో చిరుత సంచరిస్తూ, చుట్టుపక్కన పొలాల్లో తిరుగుతోంది. భద్రప్ప అనే రైతు పొలంలో మేతకు వెళ్లిన ఆవుదూడపై చిరుత దాడి చేసి గాయపరిచింది. పొలాల్లో రైతులు దుక్కిదున్నుకుంటున్న సమయంలో చిరుత సంచరిస్తూ ఉండడంతో ఎక్కడ దాడి చేస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా గ్రామ శివారులో కొండపై చిరుత ఉండడం రాత్రి పూట గ్రామంలోని కుక్కలను చంపుతోందని గ్రామస్థులు తెలిపారు. వారం రోజులుగా 4 కుక్కలను చిరుత చంపిందని తెలిపారు. అడవికి మేతకు వెళ్లిన ఆవుదూడపై చిరుత దాడి చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు స్పందించి చిరుత నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకులకు పంపుసెట్ల పంపిణీ


పంపుసెట్లు, మోటార్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజ

సిరుగుప్ప, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గంగా కల్యాణ పథకం కింద వాల్మీకులకు పంపుసెట్లు, మోటార్లను ఎమ్మెల్యే బీఎం నాగరాజు పంపిణీ చేశారు. బుధవారం సిరుగుప్ప పట్టణం వాల్మీకి భవనం ఆవరణలో చెరువులు, బావుల నుంచి నీటిని పొలాలకు తరలించేందుకు గంగా కల్యాణ పథకం కింద రైతులకు పంపుసెట్లు మోటార్లను అందజేశారు. వాల్మీకులు ప్రభుత్వ పథకాలను అందుకుని అభివృద్ధి బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప, కౌన్సిలర్ గణేష్, భూన్యాయమండలి సభ్యులు పవన్ కుమార్ దేశాయ్, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం


నూతన ఎస్ఐ తిమ్మారెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు

బళ్లారి రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రూరల్ తాలుకాలోని పరమదేవనహళ్లి నూతన ఎస్ఐ తిమ్మారెడ్డి పదవీ బాధ్యతులు తీసుకోవడంతో పలు గ్రామాల ప్రముఖులు ఆయనకు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో రాయపురం మర్రిస్వామి, రూపనగుడి వీరాంజనేయులు, రాజు, రూపనగుడి జయన్న, కుంటనహాళ్ నరసింహులు, పలు గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సింథల్తోటి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు


బస్సు సర్వీసు ప్రారంభంలో ఎమ్మెల్యే ప్రకాశ్, విద్యార్థులు

హోసూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గం తిమ్మసంద్రం పంచాయతీలోని శూలగిరి నార్త్ యూనియన్‌కు చెందిన సింథల్తోటి గ్రామానికి కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా ఈ గ్రామానికి బస్సులు లేవు. ఈ అంశం ఎమ్మెల్యే దృష్టికి రాగా గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు కల్పించాలని గత శాసనసభ సమావేశాలలో ప్రస్తావించారు. ఎట్టకేలకు మంజూరైంది. బస్సు నంబరు 24 సర్వీసును గ్రామస్థులు, విద్యార్థులతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. సింథల్తోటి గ్రామం నుంచి పెరిగై ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపకార్యదర్శి చిన్నస్వామి, శ్రీనివాసన్, నగేశ్, హరీశ్, అంజి, నాగప్ప, మునికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కరుణానిధి సాహిత్య సేవలు అపారం


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్

హోసూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ద్రవిడ సాహిత్యానికి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి అందించిన సేవలు అపారమని ఎమ్మెల్యే ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. కరుణానిధి జయంతి సందర్భంగా పుష్పాంజలి ఘటించి అన్నదానం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడమే కాక తమిళ సాహిత్యానికి ఎనలేని సేవలందించారన్నారు. ఎంతో మంది కార్యకర్తలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు.


బంతి పూల తోట

దివ్యాంగులకు సంక్షేమ పథకాల పంపిణీ


గుర్తింపు కార్డులందజేస్తున్న కలెక్టర్

హోసూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్ అర్హులైన దివ్యాంగులకు సంక్షేమాలు అందచేశారు. బుధవారం 79మందికి జాతీయ గుర్తింపు కార్డులు అందచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేకించి దివ్యాంగులకోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

పెరిగిన పూల ధరలు

హోసూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో నిరంతర వర్షాలు కురుస్తున్న కారణంగా పూల దిగుబడి తక్కువగా ఉంది. కొన్నిరోజులపాటు సరైన ధరలు లేకున్నా ఇటీవల ధరలు మళ్లీ పెరిగాయి. రెండు రోజులుగా మార్కెట్‌కు వస్తున్న వివిధ రకాల పూల బస్తాలకు ఆశించిన ధరలు పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో 150కుపైగా పూల దుకాణాలు ఉన్నాయి. గులాబీ, బటన్‌రోజా, బంతిపూలు, గెర్బెరా తదితర రకాలు ఉన్నాయి. 200 నుంచి 250 టన్నుల పూలు వచ్చాయి. గన్నేరు పూలు కిలో రూ.100, మేరిగోల్డ్ రూ.200, కనకాంబరం రూ.400, బటన్ రోజా రూ.150, సుగంధం రూ.80నుంచి 100వరకు ధర పలికాయి.

డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కంప్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డెంగీ రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి వై. రమేష్‌బాబు సూచించారు. పట్టణ సమీపంలోని కలకంబ్ల గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించి నీటి నిల్వ ట్యాంకును పరిశీలించారు. పిల్లలు డెంగీ బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ వై రమేష్ బాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అలాగే ఎమ్మిగనూరు గ్రామంలో ప్రభుత్వ సీనియర్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఏడిస్ దోమల పెంపక రహిత ప్రచార కార్యక్రమాన్ని డిగ్నిటరీస్ ప్రారంభించారు. డీహెచ్‌వో రమేష్ బాబు మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో గ్రామంలోని ప్రభుత్వ సీనియర్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమ వారం జరిగిన విద్యాసంస్థల్లో దోమల పెంపకం రహిత ప్రచార కార్యక్రమంలో ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్ప తాలుకా ఆరోగ్య అధికారి అరుణ్, డీఎంవో ప్రతాప్, వైద్యాధికారి మహమ్మద్ ఫరూక్, సీఆర్‌పీ స్వయంప్రభ, ప్రధానోపాధ్యాయురాలు సద్యజాతప్ప, బసవరాజు, బసవనగౌడ, రామప్ప, పాండురంగ, ఆరోగ్య శాఖ అధిపతి రాఘవశెట్టి, సీఈవో షెక్షావలీ, కే మంజునాథ్, బసవరాజు, ఆరోగ్య అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కలకంబ్ల పాఠశాల ఆవరణాన్ని పరిశీలిస్తున్న డీహెచ్‌వో రమేష్